క్లుప్తంగా

జగనన్న శాశ్వత భూ హక్కు పథకంతో మేలు

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆస్తి యజమానులకు శాశ్వత హక్కు కల్పించాలన్న సదుద్దేశ్యంతో జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం ప్రవేశపెట్టడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు గురువారం తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకున్న ఆస్తులకు సంబంధించిన పత్రాల నకళ్లు సచివాలయ వలంటీర్లు, సిబ్బందికి అందజేస్తే వాటికి శాశ్వత హక్కు పత్రం అందజేస్తామన్నారు. పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దాచేపల్లి తహసీల్దార్‌గా కరుణకుమార్

దాచేపల్లి: మండల తహసీల్దార్‌గా జి.కరుణకుమార్ నియమితులయ్యారు. మేడికొండూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కరుణకుమార్‌ను దాచేపల్లి తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్ పని చేసిన టి.ప్రవీణ్‌కుమార్‌ను చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌కు సరెండర్ చేశారు.

పట్టణ సీఐ బాలకృష్ణ బాధ్యతలు స్వీకారం



గురజాల: పట్టణ సీఐగా టి.బాలకృష్ణ బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు టి.బాలకృష్ణ మాచర్ల సీఐగా విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గురజాలకు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు గురజాల సీఐగా విధులు నిర్వహించిన కె.ప్రభాకర్ పల్నాడు జిల్లా స్పెషల్ బ్రాంచీ సీఐగా కొనసాగనున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐను ఎస్ఐలు టి.అశోక్‌కుమార్, బి.అనంతకృష్ణలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చవితి పందిళ్లకు అనుమతులు తప్పనిసరి

దాచేపల్లి: వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాలు, పందిళ్ల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని సీఐ సురేంద్రబాబు గురువారం తెలిపారు. విగ్రహాలు, పందిళ్లు ఏర్పాటు చేసేందుకు పోలీస్‌శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, ప్రజలకు, వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని ఆయన చెప్పారు.

హిందీభాషా దినోత్సవం

దాచేపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హిందీ భాషా దినోత్సవంను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ఆయా హైస్కూళ్లలో హిందీ ఉపాధ్యాయులను సన్మానించారు. మండలంలోని ముత్యాలంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న గొడవర్తి రాజ్యలక్ష్మిని శాలువా, పూలదండలతో సన్మానించారు. హిందీ విశిష్టత గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ముప్పాళ్ల: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధింపులకు గురి చేస్తున్నారంటూ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ కిశోర్ గురువారం తెలిపారు. మండలంలోని బొల్లవరం గ్రామానికి చెందిన తోట మాధవికి పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన జయకృష్ణతో 2018లో వివాహమైంది. పెళ్ళైన పది రోజుల నుంచి జయకృష్ణ మద్యం సేవించి తల్లిదండ్రులైన రాజేశ్వరి, భానుమూర్తిలతో కలిసి అదనపు కట్నం తేవాలంటూ వేధింపులకు గురి చేస్తుండటంతో అప్పటి నుంచి పుట్టింటిలోనే ఉంటుంది. ఐదు సంవత్సరాలైనా కాపురం చక్కదిద్దే ప్రయత్నం చేయకపోగా మరింత ఇబ్బందులకు గురి చేస్తుండటంతో ముగ్గురి పైన స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కిశోర్ తెలిపారు.

20 నుంచి ఉన్నతి రిజిస్ట్రేషన్లు

నకరికల్లు: ఈనెల 20వతేదీన ఉన్నతి కార్యక్రమంపై అవగాహన, రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 10:30గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని అన్నారు. 18 నుంచి 35ఏళ్లలోపు వయస్సు కలిగి కనీసం పదోతరగతి నుంచి బీటెక్ వరకు చదివిన యువతీయువకులు అందరూ నమోదు చేసుకోవచ్చని అన్నారు. గత నాలుగేళ్లలో ఉపాధిహామీ పథకంలో 100 రోజుల పని పూర్తిచేసుకున్న కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. రూ.27వేల వరకు స్కాలర్‌షిప్ ఉంటుందని అన్నారు. శిక్షణాకాలంలో శిక్షణతో పాటు భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఈ నెల 15న నియోజక వర్గస్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరుగుతుందని సత్తెనపల్లి తహసీల్దార్ ఎస్.సురేష్ గురువారం తెలిపారు. సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- గ్రామగ్రామాన ఉత్సాహంగా నూతన పెన్షన్ల పంపిణీ
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



దాచేపల్లిలో లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న దృశ్యం



కారెంపూడిలో పింఛన్ పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్



దుర్గిలో నూతన పెన్షన్లు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ వెలిదండి గోపాల్

గురజాల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి అన్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 3వ సచివాలయంలో నూతన పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని నూతనంగా 354 నూతన పింఛన్లు మంజూరు జరిగిందన్నారు. అర్హతే ప్రమాణికంగా చూపి పథకం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి, చర్లగుడిపాడులో ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, సీనియర్ నాయకుడు కావూరి అంజిబాబు, గోగులపాడు గ్రామంలో సర్పంచ్ నంద్యాల రాములమ్మ రామిరెడ్డి, తదితరులు నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు.

దాచేపల్లిలో 658 కొత్త పింఛన్లు పంపిణీ..

దాచేపల్లి: మండలవ్యాప్తంగా కొత్తగా మంజూరైన పింఛన్లు గురువారం అందజేశారు. నగర పంచాయతీతో పాటుగా 14 గ్రామ పంచాయతీల్లో నూతనంగా 658 పింఛన్లు మంజూరు అయ్యాయి. నగర పంచాయతీలో చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, ముత్యాలంపాడులో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, పెదగార్లపాడులో ఎంపీపీ కటకం జయశ్రీ, సారంగపల్లి అగ్రహారం, పొందుగలలో వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు అందజేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పింఛన్ అందిస్తున్నామని చైర్మన్ సాంబయ్య చెప్పారు.

కారెంపూడిలో...

కారెంపూడి: కారెంపూడి శివారు ఆదినారాయణ కాలనీలో గురువారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా కార్యదర్శి కొమ్ము చంద్రశేఖరబాబు నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఎలాంటి వివక్షకు తావు లేకుండా ప్రభుత్వం పారదర్శకంగా పింఛన్లను పంపిణీ చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముమ్మాటికీ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రభుత్వమన్నారు. పార్టీ నాయకులు కిల్లా కాశి, పొన్నలూరి సుభాని, వలంటీర్లు పాల్గొన్నారు.

దుర్గిలో...

దుర్గి: వైఎస్సార్ పెన్షన్ కానుకను మండల కేంద్రమైన దుర్గిలో పలువురు ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నూతనంగా పెన్షన్ పొందిన వృద్ధులు, వితంతువులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, సర్పంచ్ రాయపాటి మాణిక్యం చేతుల మీదుగా పలువురికి పెన్షన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ తోటకూర వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ సుజాత, గ్రామ సెక్రటరీ, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ స్వరాజ్యం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ ఏసురత్నం

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- ఎంపీ లావు, ఎమ్మెల్సీ ఏసురత్నంతో కలిసి పులిపాడులో పర్యటన

గురజాల: జోరువానలో సైతం ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంలు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో గురువారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రతి ఒక్కరిని పలకరిస్తూ వారికి అందుతున్న సంక్షేమ ఫలాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గత ప్రభుత్వ పాలన బాగుందా....ఈ ప్రభుత్వ పాలన బాగుందా అని అడగ్గా ప్రజలు జగనన్న పాలనే బాగుందని పెద్ద పెట్టున నినదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ఈ విధంగా ప్రతి గడపకు తిరిగిన దాఖలాలు లేవని, కానీ నేడు రాష్ట్రంలో ప్రతి ఒక్క ఎమ్మెల్యే ప్రతి గడపకు తిరుగుతున్నారన్నారు. దీనిని బట్టి చూస్తుంటే రాష్ట్రంలో సంక్షేమం బాగుందని అర్థమవుతుందన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరికి అర్హతను బట్టి సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూడటం జరిగిందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు, సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు వంటివి ఏర్పాటు చేసి గ్రామ స్థాయిలోనే సువర్ణ పాలన అందించడం జరుగుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), జడ్పీటీసీ అరికట్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, మండల కన్వీనర్ ఎస్.గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, మార్కెటు యార్డు డైరెక్టర్ కె.అంద్రెయ్య, కో-ఆప్షన్ సభ్యుడు పీర్ అహ్మద్, నగర పంచాయతీ చైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి, గోళ్ల సైదయ్య, తదితరులున్నారు.

మట్టి విగ్రహాల ఉచిత పంపిణీ అభినందనీయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మట్టి వినాయక బొమ్మల పంపిణీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

రెంటచింతల: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని 2 వేల మట్టివినాయకుని ప్రతిమలను మండల ప్రజలకు పంపిణీ చేస్తున్న ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ సభ్యుల సేవలు ప్రశంసనీయమని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పార్టీ మండల అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి సహాయ సహకారంతో ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ సభ్యులు తయారు చేయించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ పోస్టర్లను ఆయన గొట్టం బ్రహ్మారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. విఘ్నాలు తొలిగించే పండుగగా భావించే వినాయక చవితి పండుగ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మట్టి వినాయకుని బొమ్మలను ఆరు సంవత్సరాలుగా మండల ప్రజలకు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి ముందుకు వచ్చి యువతను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్లాస్టిక్ వస్తువులను సంపూర్ణంగా నిర్మూలించడంలో భాగంగా ఫ్లెక్సీలను నిషేధించారని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి బొమ్మలతోనే ప్రత్యేక పూజలు నిర్వహించుకుని పర్యావరణాన్ని కాపాడాలని ఆయన కోరారు. ఫౌండేషన్ అధ్యక్షుడు పేరం చెన్నారెడ్డి, దుర్గిమార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకుడు నవులూరి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

30లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

కారెంపూడి: పీఎం కిసాన్ ఆర్థిక సాయం కోసం ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతులు ఈ నెల 30వ తేదీ లోగా ఈకేవైసీ చేయించుకుంటే వారి బ్యాంకు ఖాతాలలో డబ్బు జమ అవుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి బి.యలమందారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 691 మంది రైతుల ఈకేవైసీ పెండింగ్ ఉందని వారంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులకు పెండింగ్ ఉన్న మూడేళ్ల ఆర్థిక సహాయం ఏడాదికి రూ. 2 వేలు చొప్పున మొత్తం రూ. 6 వేలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే ఈ క్రాప్ బుకింగ్ కూడా ఈ నెల 25 లోపు తప్పనిసరిగా చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ-క్రాప్ చేయించుకోకపోతే పంట నష్టం ఇతర ఆర్థిక చేయూత ప్రభుత్వం నుంచి అందదన్నారు. రైతులందరూ కూడా ఆర్‌బీకే మ్యాగజైన్ చదివే అలవాటు చేసుకోవాలని అలా చేసుకుంటే వ్యవసాయంలో మెలుకువలు తెలుస్తాయన్నారు. ప్రస్తుతం కాల్వలకు నీరు రాని పరిస్థితులలో రైతులు వరికి బదులుగా కంది, మినుము, పెసర, బుడ్డ శనగ పంటలు వేసుకోవాలని సూచించారు.

ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ దాసరి చాడేశ్వరి, రెవ.ఫాదర్ పీటర్ పాపయ్య

రెంటచింతల: విద్యార్థుల తల్లిదండ్రులు క్రీడలకు తగిన ప్రాధాన్యంను ఇవ్వాలని అప్పుడే ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఎంపీపీ దాసరి చాడేశ్వరి అన్నారు. గురువారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి బాలబాలికల అండర్-14, అండర్-17 జట్ల ఎంపికతో పాటు అథ్లెటిక్స్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారుల ఎంపిక ఆటల పోటీలను ఎంపీపీ స్కూల్ కరస్పాండెంట్ రెవ.ఫాదర్ పీటర్ పాపయ్యతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. విద్యతో పాటు ఆటలలో కూడా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. క్రీడల ద్వారా విద్యార్థులకు తగిన శారీరక వ్యాయామం ఏర్పడి, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం కూడ విద్యాభివృద్ధితోపాటు పాఠశాల స్థాయి నుంచే ఆటల పోటీలను నిర్వహించి ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తుందన్నారు. మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించినట్లు ఫాదర్ పీటర్ పాపయ్య తెలిపారు. శుక్రవారం బాలురకు ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల ద్వారా విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో మండల స్థాయి అండర్-14, అండర్-17 జట్లను ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు పాలువాయి జడ్పీ స్కూల్ పీడీ కత్తి రవి తెలిపారు. పీఈటీలు బ్రహ్మయ్య, సురేష్, సుభాని, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొని ఆటల పోటీలను పర్యవేక్షించారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

వెల్దుర్తి: మండలంలోని గొట్టిపాళ్ళ గ్రామంలో ఆగస్టు 29న జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడి నరసరావుపేటలో చికిత్స పొందుతున్న రాజబోయిన రవీంద్ర, పొన్నాల వెంకటేశ్వర్లు, సూదనబోయిన ఆంజనేయులును గురువారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తున్న వారిపై తెలుగుదేశం పార్టీ వారు ఉనికిని కాపాడుకునేందుకు రెచ్చగొడుతున్నారన్నారు. కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని వారి అభివృద్ధి కోసం అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, నాయకులు బొమ్మిన అల్లయ్య, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

పంటల పరిశీలన



పిడుగురాళ్లరూరల్: మండలంలోని జూలకల్లు గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఎ.శివకుమారి, పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త జి. రమేష్ పత్తి, కంది, మిరప పంటలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.

కేసీపీ ఆధ్వర్యంలో అన్నదానం, ఉచిత వైద్యశిబిరం

సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ ఇందిరా దత్తు జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు



రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న డాక్టర్ రామకోటయ్య

వెల్దుర్తి: రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కేసీపీ సంస్థ నిర్వహిస్తున్న సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ ఇందిరాదత్తు జన్మదిన వేడుకల సందర్భంగా మాచర్ల పట్టణంలో కేసీపీ సంస్థ ఆధ్వర్యంలో భారీస్థాయి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం కేసీపీ కాలనీలో పలు ఆసుపత్రులకు సంబంధించిన వైద్యుల ఆధ్వర్యంలో వెయ్యి మందికి ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు, క్యాన్సర్, గుండెకు సంబంధించిన పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అదే విధంగా ఇందిరాదత్తు జన్మదినం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని జరిపి ఫ్యాక్టరీ ఆవరణ, కాలనీ, మైన్స్ ప్రాంతాలలో సంస్థకు చెందిన జనరల్ మేనేజర్ చౌదరి, ఎస్‌సీఎస్‌వీ రాజు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో వందలాది మంది ఉద్యోగులు, మహిళలు పాల్గొని మొక్కలు నాటారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి వారి దేవాలయంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా ఫ్యాక్టరీ ఆవరణలో భారీ అన్నదానాన్ని జరిపారు. మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో ఇందిరాదత్తు జన్మదినం సందర్భంగా డాక్టర్ రామకోటయ్య ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

మూడు గ్రామాల్లో పత్తిపంట పరిశీలన

రెంటచింతల: పత్తి పంటకు ఆశించే పచ్చ, తెల్లదోమవంటి క్రిమికీటకాలను, రెక్కల పురుగుల నిర్మూలనకు రైతులు వ్యవసాయాధికారుల సూచనలతోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పశర్లపాడు, జెట్టిపాలెం, పాలువాయి గ్రామాలలోని పత్తి పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతంగా ఉన్నప్పుడు ఎకరాకు నాలుగు లింగాకర్షణ బుట్టలను అమర్చుకుని నివారించవచ్చునన్నారు. ఒక్కొక్క బుట్టకు 8 రెక్కల పురుగుల చొప్పున రెండు, మూడు రోజులు వరుసగా పడినా, 10 పత్తిపువ్వులకు ఒక గుడ్డి పువ్వు, 10 కాయలకు ఒక పుచ్చుకాయ గమనించిన వెంటనే దిమోడికాడ్ 1.5 గ్రాములు లేదా క్లోరిపైరీపాస్ 2.5 మిల్లి లీటర్లను ఒకలీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తిలో తెల్లదోమ ఎక్కువగా ఉంటే ఎకరాకు 20 పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎకరాకు 5శాతం వేపగింజల కషాయం లేదా 250 మి.మీ.ల వేపనూనె గాని డ్రైయజోఫాస్(ఒస్థాతియన్)ను 2.5 మి.లీటర్లను గాని ఏసిఫేట్ 1.5 గ్రాములను లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకున్నట్లయితే తెల్లదోమ ఉధృతిని నివారించవచ్చన్నారు.

మండపాలకు అనుమతులు తీసుకోవాలి

రాజుపాలెం: వినాయకచవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసేవారు అనుమతులు తప్పక తీసుకోవాలని ఎస్ఐ ఎం.నారాయణ గురువారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించేవారు ఐదుగురు అంతకంటే ఎక్కువమంది కమిటీగా ఏర్పడాలన్నారు. మైక్‌కు, విద్యుత్‌కు అనుమతులు పొందాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద ఇసుక, నీటితో నింపిన డ్రమ్ములు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడకూడదని సూచించారు. నిమజ్జన సమయం ముందుగా తెలియజేయాలని, కేటాయించిన ప్రదేశంలోనే నిమజ్జనం చేయాలని సూచించారు.

చంద్రబాబు, పవన్‌ది మిలాఖత్

దాచేపల్లి: చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లది ములఖత్ కాదని, వారిద్దరు జైలుసాక్షిగా మిలాఖత్ అయ్యారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి అన్నారు. నారాయణపురంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు, పవన్ వేరు కాదని తాము ఎప్పటినుంచో చెబుతున్నామని, చంద్రబాబు కోసమే పవన్ పార్టీ పెట్టాడనేది ఇప్పుడు స్పష్టమైందన్నారు. చంద్రబాబు, పవన్ ఒక్కటైనా వైఎస్సార్ సీపీకి ఎటువంటి ఢోకాలేదని, చంద్రబాబు, పవన్, లోకేష్ రాష్ట్రం మొత్తం తిరిగినా ప్రజలు నమ్మటంలేదన్నారు. యాత్రల పేరిట అరాచకాలు చేస్తున్నారని, ప్రజలు తగిన సమయంలో చంద్రబాబు, పవన్, లోకేష్‌లకు బుద్ధి చెబుతారని రమేష్‌రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోవటం జీర్ణించుకోలేకనే ప్రతిపక్షలు విష ప్రచారం చేస్తున్నాయని, ఎవరి ఎన్ని కుట్రలు చేసిన మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావటం ఖాయమని రమేష్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో కో-ఆప్షన్ సభ్యుడు వేల్పుల ధర్మదేవ్, నాయకులు పల్లపు హనుమంతరావు, అంజి, వేల్పుల కిషోర్ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

పిడుగురాళ్ల: సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ, కర్నూలు ఆధ్వర్యంలో డీఈఏ ఫండ్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో పల్నాడు జిల్లాల్లోని ఏడు అక్షరాస్యత కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని ప్రాజెక్టు, బ్యాంక్ అధికారులు, వలంటీర్లు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాల ప్రాజెక్టుకు జిల్లా నోడల్ ఆఫీసర్‌గా లీడ్ డిస్ట్రిక్ట్ మేజర్‌గా ఉంటారని తెలియజేశారు. ఈ ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలలో ఇద్దరు కౌన్సిలర్లు ఉంటారన్నారు. వారు వివిధ గ్రామాలలో సామాన్య ప్రజానికానికి బ్యాంకింగ్ పథకాలపై, సామాజిక భద్రత పథకాలపై, డిజిటల్ బ్యాంకింగ్‌పై, ప్రైవేటు ఆర్థిక సంస్థల మోసాలపై, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలపై, రిజర్వ్ బ్యాంక్ అంబుడ్స్‌మెన్‌పై అవగాహన కల్పిస్తారని అన్నారు. కౌన్సిలర్స్ ఈ సేవలను పూర్తి ఉచితంగా చేస్తారని, ఎలాంటి ఫీజు చెల్లించవలసిన అవసరం లేదన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

క్రోసూరు: కనీస వేతన చట్టం అమలు చేయాలంటూ మండలకేంద్రమైన క్రోసూరు ఆమంచి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆశ వర్కర్ల యూనియన్ సమావేశం జి.సీత అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతన చట్టం అమలు చేయకుండా ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. సీహెచ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సిఫారసు మేరకే పురుగుమందులు వాడాలి

జిల్లా వనరులకేంద్రం, ఏరువాక కేంద్రం అధికారులు

నకరికల్లు: రైతులకు రెండు అంతకన్నా ఎక్కువమందులు కలిపి పిచికారీ చేసే అలవాటు ఉండడం వలన పురుగులకు మందును తట్టుకునే శక్తి ఏర్పడి ఎప్పటికప్పుడు అధికమోతాదు కలిగిన కొత్తమందులు వాడాల్సి వస్తుందని జిల్లా వనరులకేంద్రం డీడీఏ ఎం.శివకుమారి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త జి.రమేష్ అన్నారు. మండలంలోని నర్సింగపాడు గ్రామంలోని పొలాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పంటకైనా సిఫారసు మేరకు ఎరువులు, పురుగుమందులు వాడాలని సూచించారు. గ్రామంలో ఎక్కువగా ప్రైవేటు వరి రకాలను సాగుచేస్తున్నట్లు గుర్తించామన్నారు. తక్కువ కాలపరిమితి గల రకాలు ప్రస్తుతం చిరుపొట్టదశలో ఉన్నాయని అన్నారు. చిరుపొట్టదశలో ఉన్న వరికి ఆఖరి దఫా వేసే యూరియా 25కిలోలకు 20కిలోల మ్యూరిమేట్ ఆఫ్ పొటాష్ కలిపి వేయాలని సూచించారు. ఆకుముడత పురుగు నష్టపరిమితి స్థాయికంటే చాలా తక్కువగా ఉన్నందున ఎలాంటి పురుగుమందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రతిరోజు వరిపొలాన్ని గమనిస్తూ అగ్గితెగులు లక్షణాలు కనిపిస్తే ఎకరాకు ట్రైసైక్లోజోల్ 120గ్రాములు లేదా ఐసోప్రొథయోలేన్ 300మిల్లీ లేదా కసుగామైసిన్ 500మిల్లీలీటర్లు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటి ఆరోగ్య సర్వే

వివరాలు వెల్లడించిన పీహెచ్‌సీ వైద్యులు

క్రోసూరు: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను శుక్రవారం నుంచి ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు చేపట్టాలని గురువారం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాల అంకమ్మబాయి, డాక్టర్ సిరిచందన వైద్యసిబ్బందికి తెలిపారు. పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లకు జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం నుంచి ప్రతి ఇంటికీ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు వెళ్లి దీర్ఘకాలిక రోగాలు, బాలింతలు, గర్భిణులు, స్కూల్ పిల్లలకు ఏడు రకాల వైద్యపరీక్షలు చేయాలన్నారు. మెరుగైన వైద్యసహాయం అవసరమైన వారికి కేటాయించిన తేదీల్లో శిబిరాలకు హాజరయ్యేలా చెప్పాలన్నారు. వైద్యశిబిరాలను అక్టోబర్ 3వ తేదీ నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్యబృందం రెండు టీంలుగా ఏర్పడి శిబిరాలకు హాజరవుతారన్నారు. వీరితో పాటు ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారన్నారు.